# బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట

మొదటి పాఠము

## లేఖనములో నీతిశాస్త్రము

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2012 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన, థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుంచి వ్రాతమూలకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహాయిస్తే, పునఃర్ముద్రింపబడకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపింపబడిన థర్డ్ మిలీనియం పరిచర్యలు ఒక లాభాపేక్షలేని క్రైస్తవ వ్యవస్థగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను సమకూర్చు నిమిత్తము ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

వర్తమాన కాలములో హితమైన, లేఖనానుసారమైన క్రైస్తవ నాయకత్వ శిక్షణ కొరకు ఇతోధికంగా అధికమవుతున్న విశ్వవ్యాప్త అవసరతకు ప్రతిస్పందనగా, మేము తేలికగా ఉపయోగించడానికి వీలైన, దాతల పోషణతో, బహుముఖ ప్రసార మాధ్యమముల ద్వారా ప్రయోగింపబడగల వేదపాఠ అధ్యయన శాల పాఠ్య క్రమమును ఐదు ప్రధాన భాషలలో (ఇంగ్లీష్, స్పానిష్, రష్యన్, మాండరిన్ చైనీస్, మరియు అరబిక్) సిద్ధం చేస్తున్నాము మరియు ఇది అత్యావశ్యకమైయున్నవారికి, ప్రాథమికంగా సంప్రదాయిక విద్యనభ్యసించడానికి అందుబాటులేని, లేదా ఆర్థికంగా భరించలేని క్రైస్తవ నాయకులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాము. పాఠములన్నియు రచింపబడినవి, రూపొందింపబడినవి, మరియు సంస్థలోపలే సిద్ధంచేయబడుతున్నవి, మరియు శైలి మరియు నాణ్యతలో హిస్టరీ ఛానల్©లో ప్రసారమగువాటి వలెనున్నవి. క్రైస్తవ నాయకులకు శిక్షణ నిచ్చుటకు ఈ అసమానమైన, ఖర్చుకు తగిన ఫలితమునిచ్చు పద్ధతి చాలా కార్యసార్థకమైనదై యున్నదని ప్రపంచమందంతటను రుజువయ్యింది. విద్య మరియు సజీవ వ్యంగ్య చిత్రముల ఉపయోగములో ప్రయోజనపడు విశిష్టమైన వీడియో చిత్రముల ఉత్పత్తి విషయంలో మేము టెల్లి అవార్డ్స్ గెలుచుకున్నాము, మరియు మా పాఠ్య క్రమము ప్రస్తుతము 192 కంటే ఎక్కువ దేశాలలో ప్రయోగింపబడుతుంది. థర్డ్ మిలీనియం పరిచర్యల యొక్క సాహిత్యం మొదలగు వస్తువులైన డీవీడీ, ముద్రణ, ఇంటర్నెట్, ఉపగ్రహ దూరదర్శిని ప్రసారములు, మరియు రేడియో మరియు దూరదర్శిని ప్రసారముల రూపంలో వాడబడుతున్నవి.

ఈ పరిచర్యలను గూర్చి మరియు మీరు మాతో కలసి ఎలా పరిచర్య చేయవచ్చునో తెలిసికొనగోరుచున్నట్లయితే, అదనపు సమాచారం కొరకు http://thirdmill.org ను సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతం.......1
నిర్వచనం.......2
దేవుడు మరియు ఆశీర్వాదములు.......2
దైవిక స్వభావము.......3
దైవిక క్రియలు.......4
విషయముల యొక్క వైశాల్యత.......5
విషయముల యొక్క లోతు.......6
మూడింతల అర్హతలు.......9
సరియైన హేతువు.......11
విశ్వాసము.......11
ప్రేమ.......12
సరియైన ప్రామాణికత.......13
ఆజ్ఞలు.......14
లేఖనమంతా.......15
సాధారణ ప్రత్యక్షత.......17
సరియైన లక్ష్యము.......17
మూడింతల ప్రక్రియ.......19
ధోరణులు.......20
దృష్టికోణములు.......21
పరిస్థితుల.......22
నిర్ణాయక.......24
అస్తిత్వ.......25
పరస్పరాధారితము.......27
ముగింపు.......28



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట

మొదటి పాఠము

లేఖనములో నీతిశాస్త్రము

## ఉపోద్ఘాతం

నేటి దినములలో అవిశ్వాసుల మధ్య మాత్రమేగాక, సంఘములో కూడా నైతిక విలువలు అనునవి సంక్షోభములో ఉన్నవి అని ప్రతి క్రైస్తవుడు ఒప్పుకుంటాడు అని అనుకొనుచున్నాను. తప్పు ఒప్పుల మధ్య ఉన్న భేదమును కనుగొనుటకు అవిశ్వాసులు కొన్ని లక్షల దిశలను వెదుకుతుంటారు. నైతిక మరియు సరియైన జీవనము అను విషయమునకు వచ్చినప్పుడు సద్భావనగల క్రైస్తవులు కూడా అటు ఇటు తిరుగులాడుతుంటారు. చాలా తక్కువ విలువలు ఉన్నట్లు అనిపించు కొంతమంది క్రైస్తవులను నేను కలిశాను, మరియు ప్రతి నైతిక ప్రశ్నకు చాలా సరళమైన జవాబులు కలిగియుండినట్లు అనిపించు ఇతర క్రైస్తవులను కూడా నేను కలిశాను.

మన జీవితములకు లేఖనములు ఏ విధంగా అనువర్తించబడాలి, మనము ఎలా ఆలోచించాలి, పనులు చేయాలి మరియు భావించాలి అను విషయములను అర్థము చేసుకొను విధానము — అనగా బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొను విధానము — నేడు మనము కలిగియున్న గొప్ప అవసరత అని నాకు వయస్సు మీరుచున్న కొలది నేను ఎక్కువ నిర్ధారణను పొందుతున్నానని నేననుకుంటాను.

క్రైస్తవ నీతిశాస్త్రమునకు సంబంధించిన మన కోర్సులో *బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట* అను మన పాఠ్యక్రమములో ఇది మొదటి పాఠము. ఈ పాఠ్యక్రమములో, మన జీవితములలో మనము అనేక రకముల నిర్ణయాలు తీసుకొనుచుండగా బైబిలు మనకు బోధించు మనము అనుసరించవలసిన ప్రక్రియ మీద దృష్టిపెడదాము. ఈ మొదటి పాఠమునకు "లేఖనములో నీతిశాస్త్రము" అను శీర్షికనిచ్చాము. మొదటిగా క్రైస్తవ నీతిశాస్త్రమునకు బైబిలు నిర్వచనమును స్థాపిస్తూ, తరువాత సత్క్రియల యొక్క మూడింతల బైబిలు అర్హతలను పరీక్షిస్తూ, చివరిగా నైతికమైన నిర్ణయములను తీసుకొనుటకు మూడింతల బైబిలు ప్రక్రియ యొక్క మౌళిక ఆకృతులను ఇస్తూ ఈ పాఠ్యక్రమమును మనము పరిచయం చేద్దాము. క్రైస్తవ నీతిశాస్త్రము అను అంశమును నిర్వచిస్తూ ఆరంభిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# నిర్వచనం

ఇంచుమించు అన్ని చోట్ల, ప్రజలందరికి నైతిక వ్యవస్థలు ఉంటాయి. నైతికమైన విషయములను నిర్ధారించు విధానముల విషయములో విభిన్నమైన మతములు, సంస్కృతులు, సమాజములు, మరియు వ్యక్తులు భిన్నమైనవిగా ఉన్నాయి, మరియు ఏ ప్రవర్తనలు మరియు ఆలోచనలను ఆమోదించాలి మరియు వేటిని తిరస్కరించాలి అను విషయములో వారు ఎంతో భిన్నమైన నిర్ధారణలను కలిగియుంటారు. ఈ విభిన్నమైన వ్యవస్థలను మరియు వాటి నిర్ధారణలను పరిశోధించు అధ్యయన విభాగమును నీతిశాస్త్రము అని పిలుస్తారు.

సామాన్య పరిభాషలో, నీతిశాస్త్రము నైతిక తప్పు ఒప్పులను గూర్చిన అధ్యయనమైయున్నది, అనగా మంచి చెడులను గూర్చిన అధ్యయనం అయ్యున్నది. ఈ నిర్వచనము నీతిశాస్త్రమును గూర్చి ఒక సామాన్యమైన ధోరణిని మనకు అందిస్తుంది, అయితే ఈ పాఠములలో, మనము విశేషముగా నీతిశాస్త్రమును గూర్చి క్రైస్తవ లేక బైబిలు అభిప్రాయము మీద దృష్టిపెడతాము కాబట్టి విస్తృతమైన నీతిశాస్త్ర అధ్యయనము మీద అంత ఆసక్తిని చూపము. కాబట్టి, నైతిక తప్పు ఒప్పుల అధ్యయనము కంటే సంకుచితమైన ఒక నిర్వచనమును మనము రూపించుదాము. క్రైస్తవ నీతిశాస్త్రమును ఈ విధంగా నిర్వచిద్దాము:

> మానవ వ్యక్తిత్వములు, క్రియలు మరియు క్రియలలో ఏవి దేవుని ఆశీర్వాదములను పొందుతాయి మరియు ఏవి పొందవు అని నిర్ధారించు మాధ్యమముగా పరిగణించబడు వేదాంతశాస్త్రము.

క్రైస్తవ నీతిశాస్త్రము మీద మనము కలిగియున్న ధోరణి యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకొనుటకు, ఈ నిర్వచనములోని మూడు విషయముల మీద మనము దృష్టిపెడదాము: మొదటిగా, ఇది దేవుని మీదికి మరియు ఆయన ఇచ్చు ఆశీర్వాదముల మీదికి దృష్టిని ఆకర్షించు విధానమును గమనించుదాము. రెండవదిగా, క్రైస్తవ నీతిశాస్త్రములో చేర్చబడిన విషయముల యొక్క వైశాల్యతను మనము చూద్దాము. మరియు మూడవదిగా, క్రైస్తవ నీతిశాస్త్రము మన క్రియలను మించి వెళ్లు విధానమును మనము పరిగణిద్దాము. నీతిశాస్త్రము దేవునికి మరియు ఆయనమనకిచ్చు ఆశీర్వాదములకు సంబంధించినదిగా ఉన్నదను విషయము మీద మన నిర్వచనము దృష్టిపెట్టు విధానమును మొదటిగా చూద్దాము.

## దేవుడు మరియు ఆశీర్వాదములు

అనేక ఇతర నైతిక వ్యవస్థలకు భిన్నముగా, మన నిర్వచనము మంచి లేక చెడు, లేక తప్పు లేక ఒప్పు వంటి పదముల మీద దృష్టిపెట్టుటకు బదులుగా దేవుడు మరియు ఆయనిచ్చు ఆశీర్వాదముల మీద



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దృష్టిపెడుతుంది. దేవుని ఆశీర్వాదములను పొందుకొను విషయములు మంచివి మరియు సరియైనవి, కాని ఆయన ఆశీర్వాదములను పొందనివి చెడ్డవి మరియు తప్పులైయున్నవి. అయితే దేవుడు మరియు ఆయనిచ్చు ఆశీర్వాదముల మీద ఈ విధంగా దృష్టిపెట్టుట వలన కలుగు కొన్ని అంతర్భావములు ఏవి?

దేవుడు మరియు ఆయనిచ్చు ఆశీర్వాదముల మీద ఈ విధంగా దృష్టిపెట్టుట ద్వారా, మనము రెండు విషయములను చెప్పుటకు ప్రయత్నిస్తాము: మొదటిగా, దేవుని స్వభావము నైతికతకు ప్రమాణమైయున్నది. రెండవదిగా, దేవుని క్రియలు నైతికత యొక్క ప్రమాణమును కనుపరుస్తాయి. ఈ రెండు ఆలోచనలను మరింత వివరముగా చూద్దాము.

## దైవిక స్వభావము

మొదటిగా, దేవుడు స్వయంగా తప్పు ఒప్పులకు, మంచి చెడ్డలకు ఉన్నతమైన పరిమాణమైయున్నాడు అని మనము ఉద్ఘాటిస్తాము. ఇలా చెప్పుట ద్వారా ఉన్నతమైన నైతికత దేవుని వెలుపల ఉన్న ప్రమాణము, అనగా మంచిగా ఉండుటకు ఆయన కూడా దానికి కట్టుబడియుండవలసిన ప్రమాణమైయున్నది అను విషయమును మనము తిరస్కరిస్తాము. బదులుగా, తాను గాక ఏ ఇతర ప్రమాణమునకు కూడా దేవుడు జవాబుదారుడు కాడు అని, ఆయన స్వభావమునకు అనుగుణంగా ఉన్న ప్రతిది మంచిది మరియు సరియైనది అని, మరియు ఆయన స్వభావమునకు అనుగుణంగా లేని ప్రతిది కీడు మరియు తప్పు అయ్యున్నది అని మనము నొక్కి చెబుతాము.

1 యోహాను 1:5-7లో యోహాను చేసిన బోధ వెలుగులో ఈ ఆలోచనలను పరిగణించండి:

> దేవుడు వెలుగై యున్నాడు; ఆయనయందు చీకటి ఎంతమాత్రమును లేదు. ఆయనతోకూడ సహవాసముగలవారమని చెప్పుకొని చీకటిలో నడిచినయెడల మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:5-7).

దేవుడు వెలుగైయున్నాడు అను ఈ రూపకము ప్రధానముగా నైతిక విశ్లేషణ అయ్యున్నది. పాపము మరియు అబద్ధములు చీకటితో పోల్చబడగా, సత్యము మరియు పాపము నుండి శుద్ధత వెలుగుతో పోల్చబడ్డాయి. ఇది దేవుడు తన స్వభావములో పాపము నుండి సంపూర్ణముగా స్వతంత్రుడైయున్నాడు అను చిత్రమైయున్నది. పాపము దేవుని స్వభావమునకు వెలుపల ఉన్నది అనుటకు ఇది వర్ణన అయ్యున్నది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇది మరియు దీనివంటి ఇతర వాక్యభాగముల వెలుగులో, దేవుని స్వభావమును మనము మంచితనమునకు మరియు నీతికి ప్రమాణముగాను మాదిరిగాను చూస్తాము. మరియు ఈ కారణముల చేతనే, ఆయన స్వభావమునకు విరోధముగా ఉన్న విషయములను మనము పాపభరితమైనవిగాను, దుష్టమైనవిగాను మరియు తప్పులుగాను ఖండించుటకు పురికొల్పబడతాము.

## దైవిక క్రియలు

దేవుని మీద మరియు ఆయనిచ్చు ఆశీర్వాదముల మీద దృష్టిపెడుతూ మనము చెప్పగోరు రెండవ విషయము ఏమనగా, దేవుని క్రియలు నైతికత యొక్క ప్రామాణికతను కనుపరుస్తాయి. ఆశీర్వాదములను కుమ్మరించుట దేవుడు సరియైన మరియు మంచి విషయములకు ఆమోదము చూపుటకు ఉత్తమమైన మార్గమైయున్నది. ఇదే విధముగా, ఆశీర్వాదములను నిలిపివేయుట మరియు శాపములను కుమ్మరించుట ద్వారా ఆయన తప్పులు మరియు చెడ్డ విషయముల పట్ల తన ద్వేషమును చూపుతాడు. బైబిలులో లెక్కలేనన్నిసార్లు ఈ నియమము పని చేయుట మనము చూస్తాము.

ఉదాహరణకు, లేవీ. 26:3లో తన నిబంధన యొక్క షరతులను ఇశ్రాయేలుకు వివరించినప్పుడు, "[ఆయన] కట్టడలనుబట్టి నడుచుకొని [ఆయన] ఆజ్ఞలను ఆచరించి"న యెడల వారి మీద అమోఘమైన ఆశీర్వాదములను కుమ్మరిస్తానని దేవుడు ప్రతిపాదించాడు. అయితే ఇదే అధ్యాయము 14వ వచనము మొదలు, ఆయన మాటలలో ప్రతిదానికి విధేయత చూపని యెడల ఘోరమైన శాపములను కుమ్మరిస్తానని ఆయన హెచ్చరించాడు. లేవీ. 26:14-16లో ఆయన ఈ శాపములను పరిచయం చేసిన విధానమును వినండి:

> మీరు నా మాట వినక నా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక నా కట్టడలను నిరాకరించినయెడలను, నా ఆజ్ఞలన్నిటిని అనుసరింపక నా నిబంధనను మీరునట్లు మీరు నా తీర్పుల విషయమై అసహ్యించుకొనినయెడలను, నేను మీకు చేయునదేమనగా, మీ కన్నులను క్షీణింపచేయునట్టియు ప్రాణమును ఆయాసపరచునట్టియు తాపజ్వరమును క్షయ రోగమును మీ మీదికి రప్పించెదను. మీరు విత్తిన విత్తనములు మీకు వ్యర్థములగును, మీ శత్రువులు వాటి పంటను తినెదరు (లేవీ. 26:14-16).

ఈ అధ్యాయములోని శాపములు అనేక వచనములలో కొనసాగుతాయి మరియు ప్రతిది మునుపటిదాని కంటే ఘోరమైనదిగా ఉంటుంది. అయితే తన ఆజ్ఞలకు విధేయులగుటకు ఉల్లంఘించువారికి మరియు ఆయనతో నిబంధన అనుబంధమును తిరస్కరించువారి మీద ఈ శాపములను కుమ్మరిస్తానని దేవుడు హెచ్చరించాడు. ఆయనకు అవిధేయులగుట చెడ్డపని అని లేక తప్పు అని ఈ వాక్యభాగములో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుడు ఎక్కడా ప్రకటించలేదు. అయితే, ఆయనకు విరోధముగా లేచువారి మీదికి ఆయన రప్పిస్తానని చెప్పిన ఘోరమైన తీర్పులలో నుండి మనము ఈ నిర్ధారణకు రావచ్చు.

మంచి చెడ్డల యొక్క ప్రామాణికతలను దేవుడు బయలుపరచిన విధానముల కొరకు మనము లేఖనములను వెదకినప్పుడు, విషయములను స్పష్టముగా మంచి లేక చెడు అని తెలుపుటకు బదులుగా దేవుని స్పందనలను నమోదు చేయుట ద్వారా బైబిలు తప్పు ఒప్పులను తెలియపరుస్తుంది అని మనము కనుగొంటాము. దేవుని ఆశీర్వాదములు మరియు శాపములను మనము జాగ్రత్తగా పరిశీలించినప్పుడు, అనేక వాక్యభాగముల యొక్క నైతిక కోణము స్పష్టమగుటను మనము కనుగొంటాము.

దేవుడు మరియు ఆయనిచ్చు ఆశీర్వాదముల మీద దృష్టిపెట్టుటతో పాటుగా, క్రైస్తవ నీతిశాస్త్రమునకు మనమిచ్చు నిర్వచనము నీతిశాస్త్ర అంశముల యొక్క వైశాల్యమును కూడా ఉద్ఘాటిస్తుంది. "నీతిశాస్త్రము" అను పదమును మనము ఉపయోగించుచుండగా, అది కేవలం ఒక వేదాంతశాస్త్ర శాఖ మాత్రమే కాదు; అది వేదాంతశాస్త్రమంతటిలో మరియు క్రైస్తవ జీవనమంతటిలో కీలకమైన అంశమైయున్నది.

## విషయముల యొక్క వైశాల్యత

మునుపు, నీతిశాస్త్రము ఆచరణాత్మక నైతిక విషయములతో వ్యవహరించిన వేదాంతశాస్త్రములోని ఉపశాఖగా పరిగణించబడేది. క్రైస్తవ నీతిశాస్త్రమును వేదాంతశాస్త్ర శాఖలలో ఒక శాఖగా మాత్రమే బోధించేవారు. ఈ పాత మాదిరిలో, నీతిశాస్త్రమును గూర్చిన ఆలోచన లేకుండానే చాలావరకు వేదాంతశాస్త్రమును చదవవచ్చు. ఫలితంగా, నీతిశాస్త్ర బోధకులు వేదాంతశాస్త్రము మరియు జీవితములోని చాలా చిన్న భాగములతో మాత్రమే వ్యవహరించేవారు.

భిన్నముగా, క్రైస్తవ నీతిశాస్త్రము క్రైస్తవ జీవితములోని ప్రతి కోణమును స్పృశిస్తుంది అని మన నిర్వచనము ఉద్ఘాటిస్తుంది. నీతిశాస్త్రము అనగా: ఏది మంచో మరియు ఏది చెడో నిర్ధారించు మార్గముగా పరిగణించబడు వేదాంతశాస్త్రము.

ఏదో ఒక విధముగా, మంచివారి మీద దేవుని ఆశీర్వాదములు మరియు దుష్టుల మీద శాపములను గూర్చి ప్రతి వేదాంతశాస్త్ర శాఖ మరియు అంశము వ్యవహరిస్తుంది. ప్రతి వేదాంతశాస్త్ర శాఖ కొన్ని వాస్తవములను నమ్మునట్లు, కొన్ని పనులను చేయునట్లు, మరియు కొన్ని అనుభవములను కలిగియుండునట్లు మనలను బద్ధులనుగా చేస్తుంది. మరియు ఈ విషయములను నమ్ముట, చేయుట మరియు అనుభవించుట సరియైన పని మరియు నమ్మకుండుట, చేయకుండుట మరియు అనుభవించకుండుట తప్పు కాబట్టి, వేదాంతశాస్త్రమంతటిలో తప్పు ఒప్పుల అధ్యయనము భాగమైయున్నది. వేదాంతశాస్త్ర మంతటిలో నీతిశాస్త్రము భాగమైయున్నది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇప్పుడు దీనిని మించి, క్రైస్తవ నీతిశాస్త్రము జీవితములోని ప్రతి భాగమును స్పృశిస్తుంది. వేదాంతశాస్త్రము స్వయంగా జీవితములోని ఒక చిన్న భాగమునకు పరిమితము చేయబడలేదు. నా పుస్తకమైన *ది డాక్ట్రిన్ ఆఫ్ ది నాలెడ్జ్ ఆఫ్ గాడ్* లోని మూడవ అధ్యాయములో, నేను "వేదాంతశాస్త్రము"ను "జీవితమంతటికి దేవుని వాక్యమును అనువర్తించుట" అని నిర్వచించాను. మరొక మాటలో, వేదాంతశాస్త్రము కేవలం దేవుడు మరియు ఆయన వాక్యము యొక్క ధ్యానము మాత్రమే కాదు. బదులుగా, ఆ ధ్యానమును అనువర్తనములోనికి నడిపించుట అయ్యున్నది. ఏది కూడా దేవుని నైతిక ప్రామాణికతలకు వెలుపల లేదు.

2 తిమోతి 3:16-17 యొక్క వెలుగులో నీతిశాస్త్రము మరియు వేదాంతశాస్త్రము పట్ల ఈ ధోరణిని పరిగణించండి:

> దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమోతి 3:16, 17).

ఉపదేశించుట, ఖండించుట, తప్పు దిద్దుట మరియు శిక్షణ చేయుట లేఖనమును మన జీవితములకు మనము అనువర్తించుకోవలసిన విధానములను క్రోడీకరిస్తుంది. ఈ వచనము ఈ విధంగా చెబుతున్నట్లు మనము క్రోడీకరించవచ్చు: దైవజనుడు తన జీవితములోని ప్రతిభాగములో నైతికముగా సరియైన పనిని చేయునట్లు సిద్ధపరచు వేదాంతశాస్త్రమునకు ప్రతి లేఖనము ప్రయోజనకరమైనది. సులువైన మాటలలో, క్రైస్తవ నీతిశాస్త్రము జీవితములోని ప్రతి భాగమును తాకుతుంది.

## విషయముల యొక్క లోతు

నీతిశాస్త్రములోని విషయముల యొక్క వైశాల్యము మీద దృష్టిపెట్టుటతో పాటుగా, అనేక నీతిశాస్త్ర వ్యవస్థల వలె మన నిర్వచనము కేవలం మన ప్రవర్తనను గూర్చి మాత్రమే మాట్లాడదుగాని, సదరు వ్యక్తుల యొక్క వైఖరులు మరియు స్వభావముల మీద కూడా దృష్టిపెడుతుంది. క్రైస్తవ నీతిశాస్త్రమునకు మనమిచ్చిన నిర్వచనము ఏ మానవ వ్యక్తిత్వములు, క్రియలు మరియు వైఖరులు దేవుని ఆశీర్వాదములను పొందుకుంటాయి మరియు ఏవి పొందుకోవు అను విషయములను ఉద్ఘాటిస్తుంది. దేవుని నైతిక ప్రామాణికతలు మన క్రియలు, మన హృదయములోని ఆలోచనలు మరియు ధోరణులు, మరియు మన సొంత స్వభావముల విషయములో మనలను జవాబుదారులనుగా చేస్తాయి.

ఇప్పుడు, బైబిలు సత్ ప్రవర్తనను ఉద్ఘాటిస్తుంది అని మనము నిశ్చయముగా చెప్పవచ్చు. మరియు క్రియలను సరియైన రీతిలో తప్పు లేక ఒప్పులుగా పరిగణించవచ్చు అని అనేకమంది ప్రజలకు స్పష్టముగా

కనిపిస్తుంది, కాబట్టి ఈ నిర్వచనములో ప్రవర్తనను చేర్చుటకు కారణమును వివరించుటకు మనము ఎక్కువ సమయమును గడపము. అయితే లేఖనము వైఖరులను నైతికముగా తప్పు లేక ఒప్పుగా చూస్తుంది అని మనము గుర్తుంచుకోవాలి. మన వైఖరులు మరియు భావోద్వేగములు నైతికతలేనివి అని, అనగా అవి మంచివి కావు లేక చెడ్డవి కూడా కావు అని అనేకమంది సద్భావనగల విశ్వాసులు అనుకుంటారు. అయితే మన భావనలను నైతికముగా సరియైనవిగా నిర్ధారించవచ్చు లేక నైతికముగా సరికానివిగా తిరస్కరించవచ్చు అని లేఖనము మరలా మరలా కనుపరుస్తుంది.

తమ జీవితము మరియు ఉనికిలోని ప్రతి కోణమును దేవుని యొక్క నైతిక ప్రామాణికతలకు అనుగుణ్యము చేయుమని బైబిలు క్రైస్తవులకు బోధిస్తుంది కాబట్టి, క్రైస్తవ నీతిశాస్త్రము కేవలం ప్రవర్తనతో మాత్రమే వ్యవహరించకూడదుగాని, భావోద్వేగములు, ధోరణులు, పక్షపాతములు, మొగ్గులు, ప్రాధాన్యతలు, ఆలోచనలు, ఊహలు, నమ్మకములు మరియు స్వయంగా మన స్వభావములతో కూడా వ్యవహరించాలి. ఉదాహరణకు, మత్తయి 5:22లో యేసు ఇలా బోధించాడు:

> తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును (మత్తయి 5:22).

మరియు మత్తయి 5:28లో ఈ మాటలను చేర్చాడు:

> ఒక స్త్రీని మోహపుచూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును (మత్తయి 5:28).

ఈ రెండు ఉదాహరణలలో, అవి తుదకు ఒక వ్యక్తిని క్రియారూపము దాల్చునట్లు పురికొల్పినా పురికొల్పకపోయినా, హృదయ భావనలు మరియు వైఖరులను యేసు పాపభరితమైనవిగా ఖండించాడు. వాస్తవానికి, ఈ వైఖరులు పాపభరితమైన క్రియలను నిషేధించిన అవే ఆజ్ఞలను ఉల్లంఘిస్తాయని ఆయన బోధించాడు.

మరియు మార్కు 7:21-23లో మానవ హృదయమును ఆయన వర్ణించిన విధానమును చూడండి:

> లోపలినుండి, అనగా మనుష్యుల హృదయములోనుండి దురాలోచనలును జారత్వములును దొంగతనములును నరహత్యలును వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమమును కామవికారమును మత్సరమును దేవదూషణయు అహంభావమును అవివేకమును వచ్చును. ఈ చెడ్డ వన్నియు లోపలినుండియే బయలువెళ్లి, మనుష్యుని అపవిత్రపరచునని ఆయన చెప్పెను (మార్కు 7:21-23).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దుష్ట వైఖరులు వాటంతట అవే నైతికముగా తప్పిదములు మాత్రమే కావుగాని, అవి దుష్ట క్రియలకు కూడా మూలములైయున్నవి.

లేఖనమును అనుసరిస్తూ, మనము నైతికముగా మంచి మరియు దుష్ట వ్యక్తులను గూర్చి కూడా మాట్లాడదాము. దుష్ట ప్రవర్తన దుష్ట హృదయములో నుండి వెలువడుతుంది; దుష్ట హృదయము దుష్ట స్వభావములో నుండి వెలువడుతుంది. ఈ కారణము చేత, మనము దేవుని సంతోషపరచగోరితే, మన క్రియలు మరియు వైఖరులు నైతికముగా మంచివిగా ఉండుట మాత్రమే సరిపోదు. మనము అంతరంగములో కూడా మంచి వ్యక్తులమైయుండాలి; మనము మంచి స్వభావములను కలిగియుండాలి.

రోమా. 8:5-9లో లేఖనము మన ఉనికిలోని ఈ అంశమును గూర్చి మాట్లాడుతుంది, అక్కడ పౌలు ఇలా వ్రాస్తున్నాడు:

> శరీరానుసారులు శరీరవిషయములమీద మనస్సునుంతురు; ఆత్మానుసారులు ఆత్మవిషయములమీద మనస్సునుంతురు; … ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైయున్నది; అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు, ఏమాత్రమును లోబడనేరదు … దేవుని ఆత్మ మీలో నివసించియున్నయెడల మీరు ఆత్మస్వభావము గలవారేగాని శరీర స్వభావము గలవారు కారు (రోమా. 8:5-9).

క్లుప్తంగా, అవిశ్వాసులందరు "శరీరానుసారులు." వారి స్వభావములు దుష్టమైనవి, కాబట్టి వారి క్రియలు మరియు వైఖరులు కూడా దుష్టమైనవిగా ఉన్నాయి. దేవునికి విరోధముగా ఉన్న మనస్సుకు మూలము పతనమైన స్థితి అయ్యున్నది అని పౌలు గుర్తించాడు మరియు అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు మరియు లోబడలేదు.

అవిశ్వాసులకు భిన్నముగా, విశ్వాసులు పరిశుద్ధాత్మ గలవారు. మరియు ఆత్మానుసారముగా నివసించువారిని గూర్చి అతడు వ్రాసినప్పుడు, పరిశుద్ధాత్మ వారిలో నివసించుచున్నందు వలన విశ్వాసులు కలిగియున్న క్రొత్త స్వభావములను అతడు సంబోధించాడు. అనగా విశ్వాసుల యొద్ద పతనమైన స్థితి యొక్క స్వభావమునకు విరుగుడు ఉన్నది మరియు దేవుని నైతిక ప్రామాణికతలకు అనుగుణంగా నివసించగల సామర్థ్యమును వారు కలిగియున్నారు.

కాబట్టి, "మానవ వ్యక్తిత్వములు, క్రియలు మరియు క్రియలలో ఏవి దేవుని ఆశీర్వాదములను పొందుతాయి మరియు ఏవి పొందవు అని నిర్ధారించు మాధ్యమముగా పరిగణించబడు వేదాంతశాస్త్రము"గా క్రైస్తవ నీతిశాస్త్రమును గూర్చి మనము మాట్లాడునప్పుడు, మనము కనీసం మూడు విషయములను గూర్చి మాట్లాడుతున్నాము: మొదటిగా, దేవుడు స్వయంగా నీతిశాస్త్రము యొక్క ప్రామాణికత అయ్యున్నాడు; తప్పులు మరియు ఒప్పులన్నిటిని కొలవగల ఏకైక కొలత ఆయనే. రెండవదిగా, వేదాంతశాస్త్రమంతా,

జీవితమంతా కూడా, నైతిక కోణములను కలిగియుంటుంది. మూడవదిగా, దేవుని నైతిక ప్రామాణికతలు మన క్రియలు, మన హృదయము యొక్క తలంపులు మరియు వైఖరులు, మరియు స్వయంగా మన స్వభావముల విషయములో మనలను జవాబుదారులుగా చేస్తాయి.

క్రైస్తవ నీతిశాస్త్రమును గూర్చి మాట్లాడునప్పుడు మన అభిప్రాయము ఏమిటో మనము నిర్వచించాము కాబట్టి, నైతికముగా మంచిదాని కొరకు బైబిలు ఇచ్చు మూడింతల అర్హతల వైపుకు మన దృష్టిని మళ్లించవలసియున్నది.

## మూడింతల అర్హతలు

ఈ సంక్లిష్టమైన విషయమును గూర్చిన బైబిలు బోధనను పరీక్షించుటకు ఒక అత్యంత సహాయకరమైన మార్గము, అవిశ్వాసుల యొక్క సత్క్రియలను *ది వెస్ట్మి న్స్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* నిర్వచించు విధానమును చూచుట అయ్యున్నది. 16వ అధ్యాయము, 7వ పేరాను వినండి, అక్కడ *ది వెస్ట్మి న్స్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* అవిశ్వాసులు చేయు సత్క్రియలను గూర్చి కొన్ని ప్రాముఖ్యమైన వ్యత్యాసములను చూపుతుంది:

> పునరుజ్జీవనముపొందని మనుష్యులు చేయు క్రియలు ... దేవుడు ఆజ్ఞాపించిన విషయములు అయ్యుండవచ్చు, మరియు వారికి మరియు ఇతరులకు కూడా ప్రయోజనకరముగా ఉండవచ్చు; అయినను, విశ్వాసము ద్వారా శుద్ధి చేయబడని హృదయములో నుండి అవి వెలువడతాయి కాబట్టి; వాక్యము ప్రకారము సరియైన మార్గములలో చేయబడవు కాబట్టి; దేవుని మహిమపరచుట అనే సరియైన ఉద్దేశ్యముతో చేయబడవు కాబట్ట; అవి పాపభరితమైయున్నవి, మరియు దేవుని సంతోషపరచలేవు, లేక మనుష్యుడు దేవుని కృపను పొందునట్లు చేయలేవు.

ఆరంభము నుండే అవిశ్వాసులు దేవుడు ఆజ్ఞాపించు కొన్ని క్రియలను చేస్తారు అని *వెస్ట్మి న్స్టర్ కన్ఫెషన్* సరిగానే అర్థము చేసుకుంటుంది. దీనిని మించి, అవిశ్వాసుల యొక్క క్రియలు తమ కొరకు మరియు ఇతరుల కొరకు మంచి మరియు ప్రయోజనకరమైన ఫలితములను ఉత్పత్తి చేయగలవు అని కూడా అది గుర్తిస్తుంది. మరొక మాటలో, ఒక విధంగా, నైతిక జీవనమును గూర్చి మనమిచ్చిన నిర్వచనమును ప్రతిబింబించు విధముగా అవిశ్వాసులు క్రియలను చేయగలరు: దేవుని ఆశీర్వాదమును కలిగించు క్రియలు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ విషయములో లేఖనము సమ్మతిస్తుంది. ఉదాహరణకు, మత్తయి 7:9-11లో ప్రభువు ఈ మాటలను పలికాడు:

> మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగినయెడల పామునిచ్చునా? మీరు చెడ్డ వారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును! (మత్తయి 7:9-11).

సాధారణముగా ప్రజలు బాహ్యముగా మంచి క్రియలను చేయుట చాలా సామాన్యమైన విషయము, తమ పిల్లలను ప్రేమించుట మరియు వారి కొరకు సమకూర్చుట వంటివి. వాస్తవానికి, దేవుడు ఆమోదించు క్రియలను పోలిన విధముగా బాహ్యముగా కనీసం ఒకసారి కూడా నడుచుకోని వ్యక్తిని కనుగొనుట, లేక దేవుని ఆశీర్వాదములను పొందు విధముగా వైఖరిని ఏనాడు కలిగియుండని వ్యక్తిని కనుగొనుట చాలా కష్టమైన పని. కాబట్టి, అవిశ్వాసులు కూడా దేవుడు ఆజ్ఞాపించిన విషయములను చేసి, వాటి ద్వారా ప్రయోజనమును పొందుతారు అను ఒక పైపై భావన ఉన్నది.

అయినను, విషయములు ఇక్కడితో ఆగిపోవుటకు *వెస్ట్మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* అనుమతి ఇవ్వదు. బదులుగా, అవిశ్వాసులు చేయు బాహ్యముగా మంచిగా కనిపించు క్రియలు వారి నిజస్వరూపమును ప్రతిబింబించవు. *కన్ఫెషన్* ఏమి చెబుతుందో గమనించండి: ఈ క్రియలు పాపభరితమైనవి; అవి దేవుని సంతోషపరచలేవు లేక ఒక వ్యక్తిని దేవుని కృపకు యోగ్యునిగా చేయలేవు.

అవిశ్వాసులు బాహ్యముగా దేవుని ఆజ్ఞలకు కట్టుబడియున్నప్పుడు మనము వారిని మెచ్చుకోవచ్చుగాని, వారు నిజముగా సద్గుణులు కారని మనము జ్ఞాపకముంచుకోవాలి. అవి దేవుని సంతోషపరచుటకు లేక రక్షణ అను ఆశీర్వాదమును పొందుకొనుటకు సరిపోవు. కాని, ఎందుకని? బాహ్యముగా దేవుని ఆజ్ఞలకు కట్టుబడియుండు క్రియలు కూడా ఎందుకు పాపభరితమైయున్నవి?

మనము చూడబోవుచున్నట్లు, దేవుని ఆజ్ఞల పట్ల విధేయత ఒక సరియైన హేతువుతో చూపబడాలి. రెండవదిగా, అది సరియైన ప్రామాణికతతో, లేఖనములో సూచించబడిన పద్ధతిని అనుసరించి చేయబడాలి. మరియు మూడవదిగా, సరియైన లక్ష్యమును, అనగా దేవుని మహిమపరచుటను, మనస్సులో ఉంచుకొని దీనిని చేయవలసియున్నది. క్లుప్తంగా, ఒక పని సరియైన హేతువుతో, సరియైన ప్రామాణికతకు అనుగుణంగా, సరియైన లక్ష్యము కొరకు చేయబడితే తప్ప, అది దేవుడు ఆశీర్వాదములను అనుగ్రహించు కార్యముగా ఉండదు.

మొదటిగా, సరియైన హేతువును దగ్గరగా పరిశీలిద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## సరియైన హేతువు

ఒక పనిని సరియైన హేతువుతో చేస్తే తప్ప, అది దేవుడు ఆశీర్వదించు పని కాలేదు. మొదటిగా, విశ్వాసము ద్వారా శుద్ధి చేయబడిన హృదయములో నుండి అది వెలువడాలి. రెండవదిగా, క్రియలు క్రైస్తవ ప్రేమలో నుండి వెలువడాలి.

### విశ్వాసము

*వెస్ట్మి న్స్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* యొక్క మాటలలో, "విశ్వాసము ద్వారా శుద్ధిచేయబడని హృదయములో నుండి వచ్చు క్రియలు ... పాపభరితమైనవి, కాబట్టి దేవుని సంతోషపరచలేవు." సరియైన హేతువు అను ఈ అర్హత క్రైస్తవ నీతిశాస్త్రమునకు మనమిచ్చిన నిర్వచనము మంచి స్వభావములను కలిగియున్న మంచి మనుష్యుల మీద దృష్టిపెట్టు విధానముతో అనుసంధానము కలిగియున్నది. మనము ఇంతకు ముందే చెప్పినట్లు, పరిశుద్ధాత్మతో నింపబడిన విశ్వాసులు మాత్రమే దేవుని ఆశీర్వాదములు అను ప్రతిఫలములను పొందగల క్రియలను చేయగలరు.

కేవలం విశ్వాసులు మాత్రమే విశ్వాసము ద్వారా శుద్ధిచేయబడిన మనస్సులను కలిగియుండుట దీనికి ఒక కారణమైయున్నది. ఇక్కడ *కన్ఫెషన్* విశ్వాసులలో నిలిచియుండి ఎదుగు రక్షించు విశ్వాసమును గూర్చి మాట్లాడుతుంది. ఇది విశ్వాసులు క్రొత్త మరియు మంచి స్వభావములను పొందుకొను శుద్ధీకరణ మాధ్యమము అయ్యున్నది. మరియు సత్క్రియలు చేయుటకు ఇది విశ్వాసులను సరియైన రీతిలో పురికొల్పుతుంది. 2:14-20లో యాకోబు వ్రాసినట్లు:

> క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పినయెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? ... ఆలాగే విశ్వాసము క్రియలులేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును ... క్రియలులేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసి కొనగోరుచున్నావా? (యాకోబు 2:14-20)

హృదయమును శుద్ధిచేయగల విశ్వాసము, రక్షించు విశ్వాసము, సత్క్రియలు చేయునట్లు పురికొల్పు విశ్వాసమైయున్నది. ఇట్టి విశ్వాసమును విశ్వాసులు మాత్రమే, కేవలం విశ్వాసులు మాత్రమే కలిగియుంటారు.

హెబ్రీ. 11:6లో హెబ్రీ పత్రిక రచయిత ఈ విషయమును తెలియపరచిన విధానమును వినండి:

> విశ్వాసములేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా (హెబ్రీ. 11:6).



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దేవుని ఆశీర్వాదములను పొందుటకు మనము చేయు ప్రయత్నములు విశ్వాసము మీద ఆధారపడి యుంటే తప్ప, మనము దేవుని సంతోషపరచలేము మరియు ఆయన ప్రతిఫలమును పొందలేము. మరొక మాటలో, మన హేతువులలో ఒకటిగా విశ్వాసము లేకుండా, మనము సత్క్రియలను చేయలేము.

ఈ సిద్ధాంతమును గూర్చి పౌలు ఇచ్చిన కథనము లేఖనమంతటిలో అత్యంత స్పష్టమైనదిగాను సూటైనదిగాను ఉన్నది. రోమా 14:23లో అతడు ఇలా వ్రాస్తున్నాడు:

> విశ్వాసమూలము కానిది ఏదో అది పాపము (రోమా. 14:23).

సత్క్రియలుగా దేవుడు వాటియందు సంతోషించాలి అంటే క్రియలు రక్షింపబడు విశ్వాసములో నుండి ప్రవహించాలి.

రక్షింపబడు విశ్వాసము యొక్క అవసరతతో పాటుగా, క్రైస్తవ ప్రేమ మీద ఎక్కువగా దృష్టిపెట్టినప్పుడు లేఖనము సరియైన హేతువు అను అంశమును కూడా ఉద్ఘాటిస్తుంది.

## ప్రేమ

మన క్రియలు ప్రేమ ద్వారా పురికొల్పబడకపోతే అవి నిష్ప్రయోజనమైనవి అని 1 కొరింథీ. 13లో పౌలు బోధించిన విషయములను పరిగణించండి. 1-3 వచనములలో అతడు ఇలా వ్రాశాడు:

> మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేనివాడనైతే మ్రోగెడు కంచును గణగణలాడు తాళమునై యుందును. ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసముగలవాడనైనను, ప్రేమలేనివాడనైతే నేను వ్యర్థుడను. బీదలపోషణకొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమ లేనివాడనైతే నాకు ప్రయోజనమేమియు లేదు (1 కొరింథీ. 13:1-3).

క్రియలు మరియు ప్రయోజనకరమైన ఫలితములను కలిగించు ఆత్మీయ వరములు కూడా ప్రేమ చేత పురికొల్పబడకపోతే ప్రతిఫలమును పొందలేవు. మరియు మనము ఇంతకు ముందే చూసినట్లు, ప్రతిఫలమునకు యోగ్యము కాని విషయములు దేవుని దృష్టిలో మంచివి కావు.

మత్తయి 22:37-40లో లేఖనములోని దేవుని ప్రత్యక్షతను యేసు క్రోడీకరించిన విధానములో కూడా మనము దీనిని చూడవచ్చు:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> అందుకాయన నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణమనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింప వలెనననుదియే. ఇది ముఖ్యమైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దానివంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను (మత్తయి 22:37-40).

దేవుని ధర్మశాస్త్రమును తిరస్కరించుట అనగా నిబంధన అనుబంధములో ఆయన తననుతాను మనకు అనుగ్రహించుకొనుచుండగా ఆయనను తిరస్కరించుట అయ్యున్నది. మరియు ఆయన ధర్మశాస్త్రమునకు అవిధేయత చూపుట పాపమైయున్నది. స్వయంగా ధర్మశాస్త్రము, మరియు మిగిలిన పాత నిబంధన అంతా, అన్నిటి కంటే ఎక్కువగా మనము దేవుని ప్రేమించుటను మరియు మన పొరుగువారిని ప్రేమించుటను కోరుతుంది అని ఇక్కడ యేసు బోధించాడు.

మనము పాటించాలని దేవుడు కోరు ప్రతి ఆజ్ఞలో ప్రేమ ఒక భాగమైయున్నది, కాబట్టి మనము ప్రేమతో క్రియలను చేయకపోతే, మనము చేయు ఏపని కూడా ఆయన ప్రామాణికతకు అనుగుణంగా ఉండదు. మరియు మనము దేవుని మరియు పొరుగువానిని కూడా ప్రేమించాలి అను విషయము దేవుని ప్రామాణికతను మరింత కష్టతరము చేస్తుంది. అవిశ్వాసులు దేవుని ప్రేమింపరు; వారు ఆయనకు విరోధులైయున్నారు. ఫలితంగా, వారు ఏనాడు దేవుని పట్ల ప్రేమ ద్వారా పురికొల్పబడలేరు. మరొక మాటలో, వారు ఏనాడు సరియైన హేతువును కలిగియుండరు. ఈ కారణం చేత, దేవుడు ఉన్నతమైన రీతిలో మంచిగా ఎంచు ఏపనిని కూడా వారు ఏనాడు చేయలేరు.

## సరియైన ప్రామాణికత

సత్క్రియలు అనునవి సరియైన హేతువులలో నుండి వెలువడాలి అని తెలిపిన తరువాత, సత్క్రియలు సరియైన ప్రామాణికతకు కూడా అనుగుణంగా ఉండాలని *వెస్ట్మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* తెలుపుతుంది. 16వ అధ్యాయము, 7వ పేరాలోని మాటలను మరొకసారి వినండి:

> పునరుజ్జీవనముపొందని మనుష్యులు చేయు క్రియలు … దేవుడు ఆజ్ఞాపించిన విషయములు అయ్యుండవచ్చు, మరియు వారికి మరియు ఇతరులకు కూడా ప్రయోజనకరముగా ఉండవచ్చు; అయినను, అవి … వాక్యము ప్రకారము సరియైన మార్గములలో చేయబడవు కాబట్టి … అవి పాపభరితమైయున్నవి…

క్రియలు మంచిగా ఉండుటకు, దేవుని వాక్యము, అనగా దేవుని ప్రత్యక్షత అను ప్రామాణికత ప్రకారం అవి చేయబడాలని ఇక్కడ కన్ఫెషన్ ఉద్ఘాటిస్తుంది.

సరియైన ప్రామాణికత పట్ల మన ధోరణిని పరిచయం చేయుటకు, మనము మూడు విషయములను చూద్దాము: మొదటిగా, లేఖనములోని ఆజ్ఞలు; రెండవదిగా, లేఖనమంతా; మరియు మూడవదిగా, సామాన్య ప్రత్యక్షత, అనగా స్వయంగా సృష్టి.

## ఆజ్ఞలు

మొట్టమొదటిగా లేఖనములోని ఆజ్ఞలన్నీ మనలను నడిపించుటకు రూపొందించబడినవి. 1 యోహాను 3:4లో యోహాను ఈ ఆలోచనను క్రోడీకరించిన విధానమును వినండి:

> **పాపముచేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహాను 3:4).**

ఇక్కడ యోహాను ఏమి చెప్పలేదో గమనించండి. ఆజ్ఞాతిక్రమము అనేక రకముల పాపములలో ఒకటి అన్నట్లుగా అతడు ఆజ్ఞాతిక్రమము చేయు ప్రతివాడు పాపము చేస్తాడు అని మాత్రమే బోధించలేదు. బదులుగా, పాపము చేయు ప్రతివాడు ఆజ్ఞను అతిక్రమిస్తాడు అని అతడు చెప్పాడు, అనగా పాపమంతా ఆజ్ఞాతిక్రమమే అయ్యున్నది. పాపమంతా దేవుని ధర్మశాస్త్రమును ఉల్లంఘిస్తుంది.

ఇక్కడ యోహాను మాటలు స్పష్టముగా ఉన్నాయి మరియు సరియైన ప్రామాణికత యొక్క అవసరతను సాధ్యమైనంత బలమైన మాటలలో తెలియజేస్తాయి. అయితే దేవుని ధర్మశాస్త్రమును కొన్ని విధాలుగా ఉల్లంఘించుట పాపము కాదు అని అనేకమంది క్రైస్తవులు నేడు ఆలోచిస్తారు అని మనము గ్రహించాలి. దేవుని ఆజ్ఞలలో కొన్నింటిని నిర్లక్ష్యము చేయవచ్చు. సరే, తన పత్రికలోని 2:9-10లో అపొస్తలుడైన యాకోబు ఈ విషయమును చర్చించాడు:

> **మీరు పక్షపాతము గలవారైతే ధర్మశాస్త్రమువలన అపరాధులని తీర్చబడి పాపము చేయువారగుదురు. ఎవడైనను ధర్మశాస్త్ర మంతయు గైకొనియు, ఒక ఆజ్ఞవిషయములో తప్పిపోయినయెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును (యాకోబు 2:9-10).**

స్పష్టముగా ధర్మశాస్త్రము యొక్క కొన్ని ఉల్లంఘనలు పాపములైయున్నవి, యాకోబు ప్రస్తావించినట్లు పక్షపాతము చూపుట వంటివి. ధర్మశాస్త్రములోని ఏ ఆజ్ఞను ఉల్లంఘించినా అది ధర్మశాస్త్రములోని ప్రతి ఆజ్ఞను ఉల్లంఘించుట అవుతుంది అని చెబుతూ యాకోబు కొనసాగించాడు. ధర్మశాస్త్రము దేవుని స్వభావమును మరియు గుణమును ప్రతిబింబించు ఐక్య భాగము కాబట్టి, దానిలోని ఏ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

భాగమును ఉల్లంఘించినా కొన్ని విధములుగా దానిలోని ప్రతి ఆజ్ఞను ఉల్లంఘించుట అవుతుంది, మరియు స్వయంగా దేవునికి విరోధముగా పాపము చేయుట అవుతుంది. కాబట్టి, ధర్మశాస్త్రమును ఏ విధంగా ఉల్లంఘించినా అది పాపమైనప్పుడు, ధర్మశాస్త్రము యొక్క ఉల్లంఘనలన్నీ పాపములవుతాయి.

ఇప్పుడు, తదుపరి పాఠములలో మనము ఈ విషయమును మరింత లోతుగా పరిశీలన చేద్దాము, కానీ ఇక్కడ ఆరంభములోనే మనము దేవుని ధర్మశాస్త్రము మరియు దాని అనువర్తనము మధ్య ఒక స్పష్టమైన వ్యత్యాసమును చూపాలి. బైబిలు దృష్టికోణములో నుండి, ప్రతి ఆజ్ఞ ఇప్పటికీ క్రీస్తు అనుచరులందరికీ వర్తిస్తుంది. అయితే అనువర్తన ప్రక్రియ మాత్రం చాలా సంక్లిష్టమైనదిగా ఉన్నది, మరియు ఎంత సంక్లిష్టమైనదిగా ఉన్నది అంటే ఒక పరిస్థితిలో విధేయత చూపుట మరొక పరిస్థితిలో విధేయత చూపుట కంటే చాలా భిన్నముగా కనిపించవచ్చు.

ఇప్పుడు, మనము సాపేక్షవాదమును ప్రతిపాదించుటలేదు అని ఉద్ఘాటించాలి. బైబిలు భిన్నమైన ప్రజలకు విభిన్నమైన అర్థములను ఇస్తుంది మరియు ఈ అర్థములు అన్నియు అర్థమైనవే అను విషయము వాస్తవము కాదు. భిన్నముగా, దేవుడు ఉద్దేశించిన విషయమునే — అనగా దాని వాస్తవిక శ్రోతలు ఉద్దేశించిన అర్థమునే — బైబిలు కలిగియున్నది. దేవుని వాక్యము మనలను బద్ధులను చేయు ఒక నియమము అయ్యున్నది, మరియు దానిని మనము మార్చలేము. కాబట్టి, సత్క్రియలు అన్నీ బైబిలు ధర్మశాస్త్ర ప్రామాణికతకు అనుగుణంగా ఉండాలి అని చెప్పుట సమంజసమే అవుతుంది.

### లేఖనమంతా

రెండవదిగా, సరియైన ప్రామాణికత బైబిలు అంతటికి సమర్పణ కలిగియుండుటను కోరుతుంది. దేవుని ధర్మశాస్త్రము సత్క్రియలు అన్నిటికి ప్రమాణమైయ్యున్నది అని మాత్రమే *వెస్ట్మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* తెలియజేయదుగాని, దేవుని వాక్యము అంతా సత్క్రియలకు ప్రమాణముగా ఉన్నది అని కూడా తెలియజేస్తుంది. అనగా, ప్రత్యక్షత అంతటి వెలుగులో, ముఖ్యముగా లేఖనము వెలుగులో, అనగా అధికారికముగా ధర్మశాస్త్రములో భాగముకాని భాగముల వెలుగులో కూడా సత్క్రియలు చేయబడాలి. ఉదాహరణకు, దానిలోని ఆజ్ఞలకు ఆధారముగా స్వయంగా ధర్మశాస్త్రము కూడా లేఖనములోని ఇతర భాగములను ఉపయోగిస్తుంది అని చూడండి.

ఉదాహరణకు, పది ఆజ్ఞలలో, విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ దాని అధికారమునకు ఆధారముగా సృష్టి వృత్తాంతమును ఉపయోగిస్తుంది అని నిర్గమ 20:9-11లో మనము ఇలా చదువుతాము:

> ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము. ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవదినమున విశ్ర

> మించెను; అందుచేత యెహోవా విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను (నిర్గమ. 20:9-11).

ఈ సమయమందు పది ఆజ్ఞలు స్వయంగా సృష్టి వృత్తాంతములోని నైతిక అంతర్భావముల మీద వాటి యొక్క నైతిక అధికారమును స్థిరపరుస్తాయి.

యేసు స్వయంగా విశ్రాంతి దినమును ఉల్లంఘించారని ఆయన శిష్యుల మీద నేరము మోపబడినప్పుడు దావీదు ప్రవర్తన ఆధారంగా వారిని సమర్థించాడు. మత్తయి 12:3-4లో యేసు మొదటిగా పరిసయ్యులకు స్పందించిన విధానమును వినండి.

> ఆయన వారితో ఇట్లనెను–తానును తనతోకూడ నున్న వారును ఆకలిగొని యుండగా దావీదు చేసిన దానిగూర్చి మీరు చదువ లేదా? అతడు దేవుని మందిరములో ప్రవేశించి, యాజకులే తప్ప తానైనను తనతోకూడ ఉన్న వారైనను తినకూడని సముఖపు రొట్టెలు తినెను. (మత్తయి 12:3-4).

యేసు దావీదు క్రియలను ఆమోదించి వారి కొరకు నైతిక అనువర్తనమును వెలికితీశాడు. ఈ సన్నివేశమును గూర్చిన కథనము ధర్మశాస్త్ర నియమములో భాగము కానప్పటికీ ఆయన ఇలా చేశాడు. కాబట్టి, బైబిలులో సత్క్రియలకు ప్రామాణికతగా ధర్మశాస్త్రము మాత్రమే పరిగణించబడలేదుగాని, ఇతర భాగములు కూడా పరిగణించబడినవి. అయితే ఇది మనకు వింతగా అనిపించకూడదు. ఎందుకంటే, ఈ పాఠంలో ఇంతకు ముందే మనము 2 తిమోతి 3:16-17ను చదివాము:

> దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది (2 తిమోతి 3:16, 17).

లేఖనములోని నైతిక అంశములను పౌలు కేవలం ఆజ్ఞలకు మరియు ధర్మాశాస్త్ర నియమములు కలిగియున్న భాగములకు మాత్రమే పరిమితము చేయలేదు. బదులుగా, నైతికమైన తర్ఫీదు కొరకు లేఖనమంతా ప్రయోజనకరమైనదిగా ఉన్నదని, మరియు ప్రతి లేఖనము మన మీద నైతిక బాధ్యతలను మోపుతుంది అని అతడు నొక్కి చెప్పాడు. కాబట్టి, మన క్రియలు నైతికముగా మంచివిగా ఉండాలి అంటే అవి లేఖనమంతటిలో ఉన్న ప్రామాణికతలకు అనుగుణంగా ఉండాలి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

### సాధారణ ప్రత్యక్షత

అయితే దేవుని వాక్యము లేఖనము కంటే విశాలమైనది అని ఇంతకు ముందే మనము చూశాము. ఒక అత్యంత ప్రాముఖ్యమైన భావనలో, స్వయంగా సృష్టిలో దేవుని ప్రత్యక్షతయే ఆయన వాక్యములో భాగమైయున్నది. కాబట్టి సృష్టి ద్వారా ఇవ్వబడిన దేవుని ప్రత్యక్షత, దీనిని సాధారణంగా "సాధారణ ప్రత్యక్షత" అని పిలుస్తాము, కూడా సత్క్రియల యొక్క ప్రామాణికతలో భాగమైయున్నది. రోమా. 1:20 లేఖనములో ఈ ఆలోచనను మనము స్పష్టమైన రీతిలో చూచు ఒక స్థలమైయున్నది. అక్కడ పౌలు ఇలా వ్రాశాడు:

> **ఆయన అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును, జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులై యున్నారు (రోమా 1:20).**

సాధారణ ప్రత్యక్షత ద్వారా దేవుని నైతిక ప్రామాణికతలను గూర్చి మానవులకు తెలిసియుండినప్పటికీ, వారు పాపము చేయుటకు ఇష్టపడతారు అని ఇక్కడ పౌలు వాదించాడు.

అయితే అసలు విషయము ఇది: మనుష్యులు దేవుని సాధారణ ప్రత్యక్షతలో బయలుపరచబడిన ప్రమాణములను ఉల్లంఘిస్తారు కాబట్టి, వారి క్రియలు ఖండించబడుచున్నవి. లేక మనము ఇప్పటి వరకు ఉపయోగించిన పదజాలములో దీనిని తెలియపరచగోరితే, సాధారణ ప్రత్యక్షత దేవుని వాక్యములో భాగమైయున్నది, మరియు సత్క్రియలు అనుగుణ్యము కలిగియుండవలసిన అర్హతలలో భాగమైయున్నది. కాబట్టి, మనము ఇంతకు ముందు చెప్పిన విషయములను ఒకసారి జ్ఞాపకము చేసుకుంటే, సత్క్రియలు ధర్మశాస్త్రములో, ప్రతి లేఖనములో, మరియు సృష్టిలో బయలుపరచబడిన దేవుని వాక్యమునకు అనుగుణంగా ఉండాలని లేఖనము బోధిస్తుంది.

## సరియైన లక్ష్యము

సరియైన రీతిలో పురికొల్పబడుట మరియు దేవుని వాక్యము అను ప్రామాణికతకు అనుగుణంగా ఉండుటతో పాటుగా, సత్క్రియలు అన్నిటికి సరియైన గురి లేక లక్ష్యము ఉండాలి. ఇప్పుడు, సత్క్రియలకు అనేక త్వరిత లక్ష్యములు ఉండవచ్చు. ఉదాహరణకు, ఆహారము, గృహము, వస్త్రములను కొనుటకు తల్లిదండ్రులు ధనము సంపాదించునప్పుడు, వారి త్వరిత లక్ష్యము తమను తాము మరియు తమ తమ కుటుంబములను పోషించుకొనుట అయ్యుంటుంది. ఇది మంచి మరియు ఉత్తమమైన లక్ష్యము. అయితే నీతిశాస్త్రమును గూర్చిన మన అధ్యయనములో, ప్రజలు చేయు క్రియల యొక్క తుది లక్ష్యము మీద మనము ఎక్కువ ఆసక్తిని పెడతాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మన క్రియలు దేవుని సంతోషపరచాలంటే, మన కుటుంబములను పోషించుట, మన తల్లిదండ్రులకు విధేయులగుట, విశ్రాంతి దినమును ఆచరించుట వంటి త్వరిత లక్ష్యములు ఒక విశాలమైన చిత్రములో భాగమైయుండాలి. ఆయనను సంతోషపరచు విధముగా జీవించుట ద్వారా దేవుని మహిమపరచుట మన ముఖ్య ఉద్దేశ్యమైయున్నది కాబట్టి మనము ఈ క్రియలను చెయ్యాలి.

మన జీవితములలో దేవుని మహిమపరచుట కేంద్రమైన, మౌలికమైన లక్ష్యమైయుండాలని లేఖనము అనేక విధాలుగా బోధిస్తుంది. కొన్ని విశేషమైన ఉదాహరణల ద్వారా మరియు సాధారణ నియమముల ద్వారా అది ఇలా చేస్తుంది. బజారులో అమ్మే మాంసమును గూర్చి పౌలు ఇచ్చు హెచ్చరికలలో ఇలాంటి ఉదాహరణలలో ఒకటి కనిపిస్తుంది. దేవుని మహిమను గౌరవించినంత వరకు భుజించుట మరియు విసర్జించుట రెండు మంచి విషయములే అని పౌలు తెలిపాడు. 1 కొరింథీ. 10:31లో, పౌలు ఈ మాటలను వ్రాశాడు:

> కాబట్టి మీరు భోజనముచేసినను పానము చేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి (1 కొరింథీ. 10:31).

కొన్ని త్వరిత లక్ష్యములు భుజించుట మేలు అని సూచిస్తాయి, కాని మరికొన్ని త్వరిత లక్ష్యములు విసర్జించుట మేలు అని సూచిస్తాయి. అయితే ఈ త్వరిత లక్ష్యములను మించిన మరొక నియమము ఉండాలని అతని వాదన అయ్యున్నది, అనగా, దేవుని మహిమ మీద ధ్యాస, మరియు ఈ అంతిమ లక్ష్యము దృష్టిలో ఉంటే తప్ప, తినుట లేక విసర్జించుట మేలైన పనిగా ఎంచబడవు.

ఆత్మీయ వరముల యొక్క ఉపయోగమును గూర్చి పేతురు తన పాఠకులను హెచ్చరించినప్పుడు కూడా ఇలానే చేశాడు. 1 తిమోతి 4:4లో పౌలు మాటలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

> ఒకడు బోధించినయెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెను; ఒకడు ఉపచారము చేసినయెడల దేవుడు అనుగ్రహించు సామర్థ్యమునొంది చేయవలెను. ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమపరచబడును. యుగయుగములు మహిమయు ప్రభావమును ఆయనకుండును గాక (1 పేతురు 4:11).

సంఘములోని వరములు మరియు పరిచర్యలు అన్ని దేవుని మహిమ అను అంతిమ లక్ష్యము కొరకు ఉపయోగించబడాలి అనునది పేతురు యొక్క ముఖ్య ఆలోచన అయ్యున్నది. క్రైస్తవ జీవితములో ప్రతి కార్యమును దేవుని ఘనపరచు విధముగా మరియు ఆయనకు మహిమను తెచ్చు విధముగా చేయాలి అను నియమమును పేతురు అనువర్తించుచున్నాడు.

లేఖనములోని ఇతర కథనములు ఈ సాధారణ నియమమును మరింత స్పష్టము చేస్తాయి. రోమా. 11:36లో ఇది స్పష్టముగా తెలియజేయబడింది, అక్కడ పౌలు ఈ మాటలను వ్రాశాడు:

> **ఆయన మూలమునను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి. యుగములవరకు ఆయనకు మహిమ కలుగును గాక (రోమా. 11:36).**

సమస్తము "ఆయన నిమిత్తము" కలిగెను అను వాస్తవమును బట్టి పౌలు ఇక్కడ గొప్ప ఆనందమును వ్యక్తపరిచాడు, అనగా ఇతర విషయములతో పాటు, ప్రతి విషయమును దేవుని కొరకు చేయాలి, మరియు ఆయన మహిమ మరియు ఘనతను ఉన్నతమైన లక్ష్యముగా కలిగియుండి చెయ్యాలి. "యుగములవరకు ఆయనకు మహిమ కలుగును గాక" అని ప్రకటించుచు పౌలు ఈ బిందువును ఉద్ఘాటించాడు.

వాస్తవానికి, వాటిని సృజించుట ద్వారా, కొనసాగించుట ద్వారా, శాసించుట ద్వారా, బలపరచుట ద్వారా, లేక ఆయన ఘనత కొరకు పరిచర్యగా పొందుకొనుట ద్వారా ఉనికిలో ఉన్న ప్రతిదానిలో తుదకు దేవుడు మహిమను పొందుతాడు అని ఈ వచనము సూచిస్తుంది. కాబట్టి, ఆయనకు మహిమను తెచ్చు క్రియలను ఆయన ఆమోదిస్తాడు మరియు ఆయన మహిమను నిర్లక్ష్యముచేయు లేక వ్యతిరేకించు క్రియలను ఆయన ఖండిస్తాడు అను విషయము మనలను ఆశ్చర్యపరచకూడదు. ఆయన మహిమను అంతిమ లక్ష్యముగా కలిగియున్న క్రియలను మాత్రమే దేవుడు ఆమోదిస్తాడు మరియు వాటికి ప్రతిఫలమిస్తాడు.

ఇప్పటి వరకు మనము క్రైస్తవ నీతిశాస్త్రమునకు బైబిలు నిర్వచనమును స్థిరపరచి సత్క్రియల కొరకు మూడింతల లేఖన అర్హతలను చూశాము కాబట్టి, ఇప్పుడు క్రైస్తవులు నైతికమైన నిర్ణయములను తీసుకోవలసిన మూడింతల ప్రక్రియను తెలుపుట ద్వారా ఈ ఆలోచనలను మనము అనువర్తించాలి.

## మూడింతల ప్రక్రియ

ఈ పాఠములన్నిటిలో, మరలా మరలా నైతికమైన నిర్ణయాలు తీసుకొనునప్పుడు మనము తీసుకొనవలసిన అభ్యాసిక దశలను మనము పరిశీలన చేద్దాము. అయితే, ఈ సమయమందు, తరువాత పాఠములో మనము మరింత పూర్తిగా వివరించు పద్ధతి యొక్క సామాన్య ఆకృతులను నిర్మించు పరిస్థితిలో మనము ఉన్నాము.

మన పద్ధతిని పరిచయం చేయుటకు మనము మూడు విషయములను చూద్దాము: మొదటిగా, విభిన్నమైన క్రైస్తవ గుంపుల యొక్క మూడు ధోరణులు; రెండవదిగా, నైతిక నిర్ణయమును తీసుకొనుటను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

గూర్చి మూడు దృష్టికోణములు; మరియు మూడవదిగా, ఈ దృష్టికోణముల యొక్క పరస్పరాధారితము. నైతికమైన నిర్ణయాలు తీసుకొనుచుండగా విభిన్నమైన క్రైస్తవ గుంపులు కలిగియుండు ధోరణులను ముందుగా పరిగణిద్దాము.

## ధోరణులు

విశ్వాసులు అనేక విధాలుగా జీవితములో నైతిక నిర్ణయాలు తీసుకొనుటకు ప్రయత్నిస్తారు, అయితే వారిని మూడు ప్రధానమైన విభాగములుగా విభాగించవచ్చు. కొందరు మన క్రైస్తవ మనసాక్షి మరియు పరిశుద్ధాత్మ నడిపింపును ఉద్ఘాటించి, ఈ అంతర్గత సూచకములకు అనుగుణంగా ఉన్నట్లయితే క్రియలు మంచివే అని వారు వాదిస్తారు. ఇతరులు లేఖనమును ఉద్ఘాటించి, క్రియలు లేఖన బోధనలను అనుసరిస్తే మంచివి, అనుసరించకపోతే చెడ్డవి అని వాదిస్తారు. మరికొందరు క్రియల యొక్క ప్రతిఫలమును ఉద్ఘాటిస్తారు, మరియు క్రియలు మంచి పరిణామాలను కలిగిస్తే మంచివి అని, చెడ్డ పరిణామాలను కలిగిస్తే చెడ్డవి అని వాదిస్తారు.

మనము ఇంతకు ముందు చూసినట్లు, బైబిలు సత్క్రియలను సరియైన హేతువుతో, సరియైన ప్రామాణికతను ఉపయోగించి, సరియైన లక్ష్యము కొరకు చేయబడిన కార్యములు అని నిర్వచిస్తుంది. మరియు వాస్తవానికి, సత్క్రియల కొరకు ఈ మూడు అర్హతలు మనము ఇంతకు ముందే ప్రస్తావించిన ఉద్ఘాటనలకు అనుసంధానం కలిగియున్నవి.

మనస్సాక్షి మరియు పరిశుద్ధాత్మ యొక్క నడిపింపును ఉద్ఘాటించువారు సరియైన హేతువునకు ప్రాధాన్యతనిస్తారు. సత్క్రియలను కేవలం మంచివారు మాత్రమే చేయగలరు అను వాస్తవమును వారు ముందు చూస్తారు అని మనము చెప్పవచ్చు. నైతిక తీర్పుల విషయానికి వస్తే, వారు ఇలాంటి ప్రశ్నలను అడుగుతున్నట్లు అనిపిస్తుంది: నా వైఖరి ఏమిటి? సరియైన నిర్ణయమును తీసుకొనుటకు కావలసిన పరిపక్వత నాలో ఉన్నదా? పరిస్థితికి దేవుని వాక్యమును అనువర్తించు ఆత్మీయ సామర్థ్యము నాకున్నదా?

తరువాత సరియైన ప్రామాణికత మీద దృష్టిపెట్టి నైతిక నిర్ణయాలు తీసుకొనువారు ఉన్నారు. వీరు లేఖన బోధలను ఉద్ఘాటిస్తారు. ఒక నైతిక సమస్యను ఎదుర్కొనునప్పుడు, వారు అడుగు మొదటి ప్రశ్న ఇలా ఉంటుంది: దేవుని వాక్యము ఏమి సెలవిస్తుంది?

చివరిగా, తమ క్రియల యొక్క పరిణామములను గూర్చి ఎక్కువగా ఆలోచించువారు సరియైన లక్ష్యము మీద ఎక్కువ ఆసక్తిని చూపుతారు. వారు ఇలాంటి ప్రశ్నలను అడుగుతూ, స్వయంగా పరిస్థితి మీద దృష్టిపెడతారు: సమస్య ఏమిటి? దీనిలో ఎలాంటి విషయములు ఉన్నాయి? ఈ సమస్యకు పరిష్కారములను ఇచ్చుట ద్వారా ఎలాంటి ఫలితములు కలుగుతాయి?

తమ నిర్ణయములను తీసుకొనుటలో క్రైస్తవులు అనుసరించు ఈ మూడు సాధారణ దశలను మనస్సులో ఉంచుకొని, సమస్త నైతికమైన నిర్ణయములను తీసుకొనుట కొరకు మూడు ప్రాముఖ్యమైన దృష్టికోణములకు ఈ దశలు ప్రాతినిధ్యం వహిస్తాయని గ్రహించుట సహాయకరముగా ఉంటుంది.

## దృష్టికోణములు

ఈ పాఠములన్నిటిలో నైతిక నిర్ణయములు లేక తీర్పులను గూర్చి మనము ఈ విధంగా మాట్లాడదాము:

> నైతిక తీర్పులలో ఒక వ్యక్తి ఒక పరిస్థితికి దేవుని వాక్యమును అనువర్తించుట భాగమైయున్నది.

ఈ నిర్వచనము మనము ఇంతకుముందే తెలిపిన అనేక విషయములను ముడిపెడుతుంది: మనము "దేవుని వాక్యము"ను ప్రస్తావించుచున్నాము ఎందుకంటే దైవికమైన ప్రత్యక్షత అనునది మనము సమస్త తీర్పులను కొలవవలసిన ప్రామాణికత లేక ప్రమాణము అయ్యున్నది. "పరిస్థితి" అను పదము మనకు సమస్యను, లక్ష్యమును, మరియు మనము పరిగణించుచున్న పరిష్కారముల యొక్క పరిణామాలను మనకు జ్ఞాపకము చేస్తుంది. మరియు సరియైన కార్యము చేయు మార్గములను నిర్ణయించుటలో ఒక వ్యక్తి యొక్క స్వభావము, హేతువు మరియు మనస్సాక్షిని ఉద్ఘాటించుటకు మనము "ఒక వ్యక్తి" అను పదమును ప్రస్తావిస్తాము. కాబట్టి, ఫలితంగా ఒక సమస్యను పరిష్కరించునప్పుడు ఈ మూడు దశలను పరిగణలోనికి తీసుకున్నప్పుడు మాత్రమే నైతిక నిర్ణయాలను సరియైన రీతిలో తీసుకొనవచ్చని మనము సూచించుచున్నాము.

ఈ మూడు కారకముల మీద ఒక విధమైన ఉద్ఘాటనను పెట్టుట అనేకమంది విశ్వాసులకు సహజవాదమునకు విరోధముగా అనిపిస్తుంది. ఎందుకంటే, అనేక సాంప్రదాయిక క్రైస్తవ ప్రాంతములలో, మన విశ్వాసము మరియు అభ్యాసమునకు ఏకైక తప్పిపోని నియమముగా మనము లేఖనములను ఆస్వాదిస్తాము. ఈ భావనలో, లేఖనము యొక్క బోధనకు మనము చేయు ఇతర పరిగణలన్నిటి కంటే ఎక్కువగా విలువనిస్తాము. అయినను, నీతిశాస్త్రమును మనము ఆశ్రయించు విధానములో మనము బైబిలు మీద ఆధారపడువారమైతే, మన ఏకైక తప్పిపోని నియమముగా లేఖనములను మనము అనుసరించువారమైతే, నీతిశాస్త్ర పరిశోధన యొక్క సంపూర్ణ ప్రక్రియను మనము చూచునప్పుడు దేవుని వాక్యమును మాత్రమేగాక పరిస్థితిని మరియు వ్యక్తిని కూడా పరిగణించమని స్వయంగా బైబిలు మనకు బోధిస్తుంది అని మనము చూడగలము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

నీతిశాస్త్రమును కనీసం మూడు విభిన్నమైన మార్గములలో లేక మూడు విభిన్నమైన దృష్టికోణములలో మనము ఆశ్రయించాలి. నీతిశాస్త్రమును దేవుని వాక్య దృష్టికోణములో నుండి, పరిస్థితి యొక్క దృష్టికోణములో నుండి, మరియు వ్యక్తి యొక్క దృష్టికోణములో నుండి మనము చేయాలి. మరియు బైబిలానుసారముగా, ఈ దృష్టికోణములన్నిటి నుండి కలుగు మెళకువలు విలువైనవే. కాబట్టి, ఈ మూడు దృష్టికోణములలో నుండి నీతిశాస్త్రమును చేయుట మరియు ప్రతి దృష్టికోణములో నుండి కలుగు మెళకువలు ఇతరవాటిలో నుండి కలుగు మెళకువలను బలపరచి, ప్రభావితము చేయుటకు అనుమతినిచ్చుట ఉత్తమమైన పద్ధతి అయ్యున్నది.

ప్రతి నైతిక తీర్పు కొరకు మూడు దృష్టికోణములను లేక పద్ధతులను గూర్చి మనము మాట్లడదాము: పరిస్థితుల దృష్టికోణము, నిర్ణాయక దృష్టికోణము మరియు అస్తిత్వ దృష్టికోణము. ఈ పాఠములలో మనము ఈ దృష్టికోణములను అనేకసార్లు మరలా మరలా పరిశీలన చేద్దాము, అయితే ఈ సమయమందు ప్రతి దృక్కోణము యొక్క సామాన్య ఆలోచనను మనము చూద్దాము.

## పరిస్థితుల

మన నైతిక అన్వేషణలు స్వయంగా సమస్యల మీద, లేక క్రియల యొక్క పరిణామాల మీద, లేక లక్ష్యముల మీద దృష్టి పెట్టినప్పుడు, మనము పరిస్థితుల దృష్టికోణములో నుండి నీతిశాస్త్రమును చేయుచున్నాము. ఈ ధోరణిని మనము “హేతువాదము” అని పిలువవచ్చు, ఎందుకంటే ఇది క్రియల యొక్క అంతము లేక ఫలితము మీద దృష్టిపెడుతుంది. పరిస్థితుల దృష్టికోణములో నుండి నీతిశాస్త్రమును ఆశ్రయించుటలో దేవుని పరిభాషలో ఫలితముల మార్గముల యొక్క అనుబంధములను చెప్పుట, దేవుని ఉద్దేశ్యములను పొందుకొనుటకు ఉత్తమైన మార్గములు ఏవి? అనునటువంటి ప్రశ్నలను అడుగుట భాగమైయున్నది. దేవుడు, యేసు, మరియు లేఖనములోని ఇతర నైతికమైన పాత్రల యొక్క ఉదాహరణల ఆధారంగా నైతికమైన ప్రవర్తన కలిగియుండాలని పిలుపునిచ్చుట కూడా దీనిలో భాగమైయున్నది.

దేవుని సార్వభౌమత్వము, ఆయన సృష్టిని దైవకృతముతో శాసించు విధానము వంటి నైతిక అంశములను గూర్చి మనకు ఉపదేశించునప్పుడు లేఖనము స్వయంగా ఈ దృష్టికోణమును తరచుగా ఉపయోగిస్తూ, మనలను ప్రోత్సహిస్తుంది. విమోచనలో జరిగిన సన్నివేశములను సంబోధించునప్పుడు లేక దేవుని, యేసును మరియు ఇతరులను ఆదర్శ ప్రవర్తనకు మాదిరులుగా సూచించునప్పుడు ఇది మరింత స్పష్టముగా కనిపిస్తుంది. ఉదాహరణకు, రోమా. 6:2-4లో, పాపము నిమిత్తము మనము మరణమునొందుట మరియు క్రీస్తుతో మనము సమాధి చేయబడుట ఒక లక్ష్యమును, అనగా మనము పాపము లేకుండా నైతికముగా వేరుపరచబడినవారిగా జీవించుట అను లక్ష్యము సాధించుటకు జరిగాయని పౌలు వాదించాడు:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించుదుము? ... క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, ... ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి (రోమా. 6:2-4).

ఇలా చేయుట ద్వారా, అతడు దేవుని ఆజ్ఞల మీద లేక మన జీవితములు మరియు మనస్సాక్షుల మీద పరిశుద్ధాత్మ యొక్క ప్రభావము మీద అతడు దృష్టిపెట్టలేదుగాని, విమోచన సన్నివేశములు మరియు మనము రక్షింపబడుటకు మార్గములతో సహా పరిస్థితి యొక్క వాస్తవికతల మీద దృష్టిపెట్టాడు.

రోమా. 6వ అధ్యాయమును కూడా పౌలు నీతిశాస్త్రము యొక్క పరిస్థితుల దృష్టికోణముతో ముగించాడు. రోమా. 6:32లో పౌలు ఈ మాటలు వ్రాసాడు:

> మీరు పాపమునకు దాసులై యున్నప్పుడు ... అప్పటి క్రియలవలన మీకేమి ఫలము కలిగెను? వాటినిగురించి మీరిప్పుడు సిగ్గుపడుచున్నారు కారా? వాటి అంతము మరణమే, అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము (రోమా. 6:20-22).

పరిశుద్ధమైన, నైతికమైన జీవితములను జీవించుచు, వారు ఒకప్పుడు చేసిన పాపములను విడిచిపెట్టమని పౌలు తన పాఠకులను ప్రోత్సహించాడు. పరిశుద్ధమైన జీవితములను జీవించుట ద్వారా, వారు నిత్య జీవమును పొందుతారని పౌలు వాదించాడు. ఇక్కడ, అతడు పరిణామాల ఆధారంగా కూడా వాదించాడు, కాని ఈ సారి దైవికమైన జీవితమునకు స్పందనగా కలుగు ప్రతిఫలము మీద అతడు దృష్టిపెట్టాడు.

పేతురు కూడా నైతికమైన ప్రవర్తనకు పరిస్థితుల వాదనలను అందించాడు. 1 పేతురు 2:21లో అతడు వాదించిన విధానమును వినండి:

> క్రీస్తు కూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను (1 పేతురు 2:21).

నీతి నిమిత్తము హింసింపబడుటకు సిద్ధపడియుండమని ఇక్కడ పేతురు విశ్వాసులను ప్రోత్సహించాడు, మరియు అతడు లేఖనమును ఉల్లేఖించుట ద్వార లేక పరిశుద్ధాత్మ యొక్క అంతర్గత నడిపింపు ద్వారా ఇలా చేయలేదుగాని, విమోచన చరిత్రలోని వాస్తవములను తెలియజేయుట ద్వార మరియు విశేషముగా సిలువ మీద యేసు పొందిన శ్రమ యొక్క ఉదాహరణను ఇచ్చుట ద్వారా చేశాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## నిర్ణాయక

క్రైస్తవులు అత్యంత అవలీలగా తెలుసుకోగల దృష్టికోణమును మనము నిర్ణాయక దృష్టికోణము అని పిలుస్తాము. దేవుని వాక్యము నీతిశాస్త్రమునకు సూత్రముగా లేక ప్రమాణముగా ఉన్నది అని నిర్ణాయక దృష్టికోణము సూచిస్తుంది. మనము చేయవలసినదానిని ఎలా చెయ్యాలో చెప్పుట కొరకు బైబిలును మనము చూసినప్పుడు నిర్ణాయక దృష్టికోణములో నుండి నీతిశాస్త్రమును చేయుచున్నాము.

ఉదాహరణకు, ఇశ్రాయేలులో సరియైన ఆరాధనను పునరుద్ధరించుటకు, పస్కా పండుగను ఆచరించమని యోషీయా రాజు తన ప్రజలను హెచ్చరించాడు. 2 రాజులు 23:21లో అతడు వారికి ఇలా ఆజ్ఞాపించాడు:

> **నిబంధన గ్రంథమునందు వ్రాసియున్న ప్రకారముగా మీ దేవుడైన యెహోవాకు పస్కాపండుగను ఆచరించు[డి] (2 రాజులు 23:21).**

విమోచన చరిత్ర, లేక వారి పరిస్థితి యొక్క వాస్తవికతలు వారిని ఈ బాధ్యతకు కట్టుబడునట్లు చేశాయని, లేక దేవుడు వారిని అంతర్గతముగా పస్కా పండుగను జరుపునట్లు నిర్దేశించాడు అని అతడు వాదించలేదుగాని, స్వయంగా లేఖనమే దీనిని జ్ఞాపికగా జరుపుకోమని వాటిని నిర్దేశించిందని అతడు తెలిపాడు. మోషే ద్వారా తన ప్రజలకు దేవుడు ఇచ్చిన ధర్మశాస్త్రములోని మాటలను అతడు ఉపయోగించాడు.

1 యోహాను 3:23లో విశ్వాసము మరియు ప్రవర్తనకు ఆధారముగా దేవుని ఆజ్ఞను ఉపయోగించినప్పుడు అపొస్తలుడైన యోహాను కూడా ఇదే నిర్ణాయక దృష్టికోణమును ఉపయోగించాడు:

> **ఆయన ఆజ్ఞ యేదనగా–ఆయన కుమారుడైన యేసుక్రీస్తు నామమును నమ్ముకొని, ఆయన మనకు ఆజ్ఞనిచ్చిన ప్రకారముగా ఒకనినొకడు ప్రేమింపవలెననునదియే (1 యోహాను 3:23).**

మరొకసారి, ప్రవర్తనకు దేవుని వాక్యము ఆధారమైయున్నది. ప్రజలు ఒక రీతిలో ప్రవర్తించాలని మరియు నమ్మాలని దేవుడు ఆజ్ఞాపించాడు, మరియు స్వయంగా ఆయన అధికారమే ఈ నైతిక ప్రామాణికతకు అనుగుణం కలిగియుండునట్లు ప్రజలను బద్ధులనుగా చేసింది.

ఇప్పటి వరకు పరిస్థితుల మరియు నిర్ణాయక దృష్టికోణములను చూశాము కాబట్టి, ఇప్పుడు ఒక వ్యక్తి యొక్క దృష్టికోణములో నుండి చూడబడు నీతిశాస్త్రమును మనము పరిశీలన చేద్దాము, దీనిని అస్తిత్వ దృష్టికోణము అని పిలుస్తారు.

## అస్తిత్వ

పాలుపంచుకొనుచున్న ప్రజలకు సంబంధించిన ప్రశ్నలను అడుగుట ద్వారా మనము నీతిశాస్త్రమును ఆశ్రయించినప్పుడు, మనము అస్తిత్వ దృష్టికోణములో నుండి నీతిశాస్త్రమును చేయుచున్నాము. "అస్తిత్వ" అను మాటకు అర్థము మనము ఈ దృష్టికోణమును అస్తిత్వవాదుల తత్వముతో అనుసంధానము చేస్తున్నాము అని కాదు. బదులుగా, ఈ దృష్టికోణము నీతిశాస్త్రమును ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత అనుభవము అను అద్దములో నుండి చూస్తుంది అని మన అర్థమైయున్నది. అస్తిత్వ దృష్టికోణము దేవుని ఎదుర్కొనుట మరియు ఆయనతో సంకర్షించుటలో ఒక వ్యక్తి యొక్క స్వయము మీద దృష్టిపెడుతుంది. ఈ దృష్టికోణములో నుండి మనము నీతిశాస్త్రమును ఆశ్రయించినప్పుడు, మనము మంచి చెడ్డలకు ఉన్నతమైన ప్రమాణముగా దేవుని అధికారమును తక్కువ చేయము లేక మన భావనలను హెచ్చించుకోము. బదులుగా, నేను పరిశుద్ధునిగా ఉండుటకు నన్ను నేను ఏ విధంగా మార్చుకోవాలి? అనునటువంటి ప్రశ్నలను అడుగుతాము. మరియు పరిశుద్ధాత్మ యొక్క అంతరంగ నడిపింపు మరియు పరిశుద్ధపరచబడిన వ్యక్తిగత మనస్సాక్షి వంటి ప్రభావముల మీద ఎక్కువ దృష్టిపెడతాము.

కాబట్టి, లేఖనము మన మనస్సాక్షులను మరియు పరిశుద్ధాత్మ యొక్క నడిపింపును మంచి చెడ్డలను నిర్ణయించుటకు అర్హమైన మార్గముగా ఎంచుతుంది అని మనము ఉద్ఘాటిస్తాము. పరిస్థితుల మరియు నిర్ణాయక దృష్టికోణములతో పాటుగా, నీతిశాస్త్ర తీర్పులను చేయుటకు ప్రయత్నించుచుండగా అస్తిత్వ దృష్టికోణము కూడా మనకు ఉపయోగకరమైన పరికరము అయ్యున్నది.

నీతిశాస్త్రము పట్ల ఈ ధోరణి కొరకు లేఖనములో అనేక ఉదాహరణలు ఉన్నాయి, వీటిలో ఒకటి 1 యోహాను 3:21, అక్కడ అపొస్తలుడు ఇలా వ్రాశాడు:

> **ప్రియులారా, మన హృదయము మనయందు దోషారోపణ చేయనియెడల దేవుని యెదుట ధైర్యముగలవారమగుదుము (1 యోహాను 3:21).**

విమోచన పొందిన ప్రజలుగా మన హృదయములు దేవుని స్వభావముతో శ్రావ్యత కలిగియున్నవి, మరియు దేవుని ప్రేమ మనలో నిలిచియుంటే, ఏది తప్పో మరియు ఏది ఒప్పో మనము గమనించగలము అని అతడు తెలియజేయుటకు ప్రయత్నించుచున్నాడు. తప్పు ఒప్పులను గూర్చిన అంతరంగ నిర్ధారణను కలిగించుట కొరకు దేవుడు ప్రజల మధ్య సంచరిస్తాడు. మరియు నీతిశాస్త్రమును చేయు విషయములో మనము ఈ విషయమును గుర్తించినప్పుడు, మనము అస్తిత్వ దృష్టికోణమును ఉపయోగించుచున్నాము.

మనము ఇదే రకమైన ఆలోచనను పౌలు యొక్క రచనలలో కూడా చూస్తాము. ఉదాహరణకు, గలతీ. 5లో పౌలు శరీరమును మన పాపపు స్వభావముతో అనుసంధానము చేసి, మన శరీరము మనలను చేయునట్లు పురికొల్పు అనేక అనైతిక కార్యములను తెలియజేశాడు. నైతికముగా మంచి విషయములైన



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రేమ, ఆనందము మరియు సమాధానము వంటివాటిని ఉత్పత్తి చేయుటకు పరిశుద్ధాత్మ మనలో కార్యములు చేస్తాడు అని కూడా అతడు వివరించాడు. ఈ నేపథ్యములో, పరిశుద్ధాత్మ యొక్క అంతరంగ నడిపింపునకు విధేయత చూపుట ద్వారా విశ్వాసులు సత్క్రియలను చేయగలరని అతడు వివరించాడు.

గలతీ. 5:16లో అతని బోధనను వినండి:

> నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు (గలతీ. 5:16).

ఆత్మ యొక్క అంతరంగ నడిపింపును ఆలకించుట నైతికమైన తీర్పులను చేయుటలో విశ్వాసులకు సహాయము చేయు ఒక అర్థమైన మార్గమైయున్నది. మరియు మనము ఇలా చేయునప్పుడు, మనము తప్పు ఒప్పులను అస్తిత్వ దృష్టికోణములో నుండి చూస్తాము.

రోమా. 14:5, 14, 23లో, అస్తిత్వ దృష్టికోణము మీద పౌలు ఎంత ఉద్ఘాటనను పెట్టాడు అంటే, మన మనస్సాక్షులు పరిపూర్ణమైనవి కానప్పటికీ వాటిని ఉల్లంఘించుట పాపము అయ్యున్నదని అతడు ఉద్ఘాటించాడు.

> ప్రతివాడు తనమట్టుకు తానే తన మనస్సులో రూఢిపరచు కొనవలెను... సహజముగా ఏదియు నిషిద్ధము కాదని నేను ప్రభువైన యేసునందు ఎరిగి రూఢిగా నమ్ముచున్నాను. అయితే ఏదైనను నిషిద్ధమని యెంచుకొనువానికి అది నిషిద్ధమే. అనుమానించువాడు తినినయెడల విశ్వాసములేకుండ తినును, గనుక దోషి యని తీర్పు నొందును (రోమా. 14:5, 14, 23).

విగ్రహములకు బలి అర్పించిన ఆహారమును గూర్చి పౌలు మాట్లాడుతూ, ఆ ఆహారమును భుజించుట విగ్రహారాధన చేయుటతో సమానమని తమ మనస్సులలో తలంచనంతటి వరకు క్రైస్తవులు ఆ ఆహారమును తినుట మంచిదే అని పౌలు వివరించాడు. అయితే ఈ విధముగా భుజించుటకు వారి మనస్సాక్షులు వారికి అనుమతి ఇవ్వకపోతే, ఆ ఆహారమును వారు తినుట పాపము అవుతుంది.

ఆసక్తికరముగా, ఈ అధ్యాయము యొక్క నేపథ్యములో, ఈ విషయమును కేవలం నిర్ణాయక మరియు పరిస్థితుల దృష్టికోణము నుండి మాత్రమే చూస్తే, ఎక్కువమంది విశ్వాసులు దానిని తినుటకు మొగ్గుచూపుతారు అని పౌలు వాదించాడు. అయితే విశ్వాసులు అస్తిత్వ దృష్టికోణములో ఉన్న మెళకువలను కూడా పరిగణలోనికి తీసుకోవాలని మరియు మూడు దృష్టికోణములలో నుండి ఒకే విధమైన నిర్ధారణలకు వస్తే తప్ప వారు దానిని భుజించకూడదు అని అతడు వక్కాణించాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇప్పటి వరకు నీతిశాస్త్రములో పరిస్థితుల, నిర్ణాయక, మరియు అస్తిత్వ దృష్టికోణములను పరిచయం చేశాము కాబట్టి, ఇప్పుడు ఈ మూడు దృష్టికోణములు సంకర్షించు మరియు ఒకదాని మీద ఒకటి ఆధారపడు విధానమును చూచుటకు కొంత సమయమును కేటాయించాలి. మనము నీతిశాస్త్రమును ఆశ్రయించు మూడు విభిన్నమైన దృష్టికోణములు మూడు వేర్వేరు భాగములు కావు; బదులుగా, ప్రతి దృష్టికోణము నీతిశాస్త్రము అంతటిలో భాగమైయున్నది, మరియు ఏదో ఒక కోణము నుండి వీక్షించబడుతుంది.

ఇది కొంత అయోమయంగా ఉంటుంది అని నేను ముందుగానే ఒప్పుకోవాలి. ఎందుకంటే, ఈ పాఠములో ఇంతకు ముందే మనము ఇచ్చిన ఉదాహరణలు కొన్ని ఒక సమయమందు ఒకే దృష్టికోణమును ఉపయోగిస్తాయి అన్నట్లు అనిపిస్తుంది. కాని వాస్తవానికి, మన ఉదాహరణలన్నిటిలో మూడు దృష్టికోణములు అన్ని భాగమైయుంటాయి. మూడింటి మధ్య ఉన్న భేదములను ఎత్తిచూపుటకుగాను ఒక దృష్టికోణము ప్రాముఖ్యముగా కనిపించు ఉదాహరణలను మనము ఎంపికచేసుకున్నాము అంతే. ఏ దృష్టికోణము కూడా ఇతరవాటి నుండి ఏకాంతముగా పని చేయలేదు అనునది వాస్తవమైయున్నది.

## పరస్పరాధారితము

మొదటిగా, పరిస్థితుల దృష్టికోణములో భాగమైయున్నదానిని పరిగణించండి. ఈ పరిస్థితి, ఈ విషయములో పాలివారైన వ్యక్తులు మరియు దేవుని వాక్యముతో సహా, మనము పరిగణించు నైతిక ప్రశ్నలకు సంబంధించిన ఔచిత్యమైన వాస్తవములన్నిటిని కలిగియుంటుంది, మరియు ఈ ప్రామాణికత ఆధారంగా మనము విషయమును విశ్లేషించవలసియున్నది. వ్యక్తులు లేనియెడల, నీతిశాస్త్ర విచారణ చేయుటకు ఎవరు మిగిలియుండరు, మరియు దేవుని ప్రత్యక్షత లేని యెడల, వాస్తవికతలను గూర్చి మనము ఏమి తెలిసికొనియుండలేము. మరొక మాటలో, పరిస్థితుల దృష్టికోణములో నుండి నైతికమైన ప్రశ్నలను మనము విశ్లేషించినప్పుడు కూడా, మన పరిశోధనలలో ఎల్లప్పుడూ వ్యక్తిగత మరియు నిర్ణాయక పరిగణలు భాగమైయుండాలి. మనము పరిస్థితిని దేవుని వాక్యము వెలుగులో చూస్తే తప్ప, మరియు వ్యక్తులుగా పరిస్థితి మన మీద చూపు ప్రభావమును గుర్తిస్తే తప్ప, మనము పరిస్థితిని సరిగా అర్థము చేసుకోలేము అని చెప్పుట సమంజసమే అవుతుంది.

నిర్ణాయక దృష్టికోణము విషయములో కూడా ఇదే వాస్తవమైయున్నది. మన పరిస్థితులకు మరియు స్వయంగా మనకు మనము లేఖనములోనికి మాటలను అనువర్తించలేకపోతే, మనము లేఖనమును సరిగా అర్థము చేసుకోలేదు అని అర్థము. "'దొంగిలవద్దు' అంటే అర్థము ఏమిటో నాకు తెలుసు, కాని అది నాకు మరియు నేను, నన్ను ఉద్యోగములో పెట్టుకున్నవాని నుండి ధనమును దోచుకొనుటకు ఎలా అనువర్తించుకోవాలో నాకు తెలియదు" అని చెప్పు ఒక వ్యక్తిని పరిగణించండి. "దొంగిలవద్దు" అను మాటల యొక్క సరియైన అర్థము ఈ వ్యక్తికి ఖచ్చితముగా తెలియదు. నిర్ణాయక అర్హతలు ఈ వ్యక్తికి తెలిసియున్నట్లు

అనిపిస్తాయిగాని, ఇవి అనువర్తించబడు పరిస్థితుల నేపథ్యమును గ్రహించుటలో అతడు విఫలమగుట వాస్తవానికి, బైబిలు ఆశించు విషయములు అతనికి తెలియవు అని నిర్ధారిస్తుంది.

మరియు, అవును, అస్తిత్వ దృష్టికోణము విషయములో కూడా మనము దీనినే చెప్పవచ్చు. దాని పరిస్థితి యొక్క నేపథ్యములో దానిని చూసి, దేవుని వాక్య ఆధారముగా దానిని సరిగా వ్యాఖ్యానిస్తే తప్ప మనము స్వయమును సరిగా అర్థము చేసుకోలేము. మనము సరిగా ఆలోచించాలంటే మన మనస్సాక్షులకు లేఖనము తెలిసియుండాలి. మరియు మన మనస్సాక్షి మన బాధ్యతలను సరిగా తెలుపుటకు ముందు మనము పరిస్థితులను గూర్చిన వాస్తవములను కూడా ఎరిగియుండాలి.

కాబట్టి, ప్రతి దృష్టికోణము ఇతరుల యొక్క పరిగణలకు మార్గము తెరుస్తుంది. మనము ఏ దృష్టికోణమునైనా పరిపూర్ణమైన రీతిలో అనువర్తించినప్పుడు, ఇతర రెంటి నుండి మనము పొందగల అవే మెళకువలను అది మనకు చూపుతుంది. సమస్య ఏమిటంటే మనము పరిపూర్ణమైన మెళకువ గల పరిపూర్ణమైన మానవులము కాము. ఈ కారణము చేత, విషయములను మనము విశేషమైన నిర్ణాయక దృష్టికోణములో ఆశ్రయించినప్పుడు అస్తిత్వ మరియు పరిస్థితుల సమస్యలను మనము స్పష్టముగా చూడలేము. మరియు మనము కేవలం పరిస్థితుల దృష్టికోణమును మాత్రమే ఉపయోగించినప్పుడు మనము నిర్ణాయక మరియు అస్తిత్వ సమస్యలను అర్థము చేసుకోలేము. మరియు అవును, నీతిశాస్త్ర ప్రశ్నల యొక్క అస్తిత్వ అంశములను మాత్రమే మనము చూసినప్పుడు, నిర్ణాయక మరియు పరిస్థితుల సమస్యలను గూర్చి సరియైన నిర్ధారణలకు రాలేము అనునది కూడా వాస్తవమైయున్నది.

మనము నీతిశాస్త్రమును గూర్చి పరిపూర్ణమైన రీతిలో ఆలోచన చేయగలిగితే, ఈ మూడు దృష్టికోణములు కూడా ఎల్లప్పుడూ ఖచ్చితముగా ఒకే నిర్ధారణలను మరియు మెళకువలను కలిగించగలవు. అయితే మనము పరిపూర్ణులము కాదు కాబట్టి, మనము మూడు దృష్టికోణములన్నిటిని ఉపయోగించాలి, తద్వారా నైతిక సమస్యలను గూర్చి వీలైనంత సమాచారమును మనము కలిగియుండవచ్చు. మూడు దృష్టికోణములన్నిటిని ఉపయోగించుట ద్వారా, ఏ ఒక్క దృష్టికోణము యొక్క మెళకువల కొరకైనా మనము నియంత్రణలను కలిగియుండగలము.

## ముగింపు

ఈ పాఠంలో, క్రైస్తవ నీతిశాస్త్రమును దాని యొక్క నైతిక కోణములలో నుండి పరిగణించబడు వేదాంతశాస్త్ర మొత్తము అని నిర్వచిస్తూ ఈ అంశమును పరిచయం చేశాము. సత్క్రియల కొరకు బైబిలు యొక్క మూడింతల అర్హతలను కూడా మనము వివరించాము. చివరిగా, నిర్ణాయక, పరిస్థితుల మరియు అస్తిత్వ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

దృష్టికోణములను ఉద్ఘాటించుట మరియు సమతుల్యము చేయుట వలన కలుగు లాభములను పరిగణలోనికి తీసుకొను నైతిక నిర్ణయాలను తీసుకొనుటకు బైబిలు మాదిరిని కూడా మనము ప్రతిపాదించాము.

ఆధునిక లోకములో బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుట ఎన్నో సవాళ్లతో కూడిన పని అయ్యున్నది. మనము తరచుగా అనేక రకముల ప్రభావములతో ఈడ్వబడతాము, మరియు వీటిలో చాలా దేవుని అధికారమును గుర్తించవు మరియు ఆయన మంచితనమును గూర్చి పట్టించుకోవు. అయితే క్రైస్తవులముగా మనము దేవుని మంచితనమును ఉద్ఘాటించాలి, మరియు మన నైతిక నిర్ణయాలలో మనము దానిని అనుసరించాలి. మరియు నీతిశాస్త్రమును గూర్చిన నిర్ణాయక, పరిస్థితుల మరియు అస్తిత్వ దృష్టికోణములను ఉపయోగించుట ఈ పనిని చేయుటకు ఒక ఉపయోగకరమైన మార్గమైయున్నది. మన ఆలోచనలోనికి ఈ దృష్టికోణములను చేర్చుచుండగా, సంక్లిష్టమైన నైతిక సమస్యలను విశ్లేషించుటకు మరియు జ్ఞానపూర్వకమైన, బైబిలానుసారమైన నిర్ణయాలను తీసుకొనుటకు మనలను మనము సిద్ధము చేసుకుంటాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.